

# మధ్యతరగతి మనిషి

జి. హేమంత

"అమ్మగారూ! కొంచెం కాఫీపొడి ఇస్తారా?" గది గుమ్మం దగ్గర నిలబడి అంది రంగి.

"అక్కడ అమ్మ ఉంటుంది — అడుగుదూ!" పుస్తకంలో నుండి తల ఎత్తకుండానే అంది సుమిత్ర.

"అమ్మంటే మీ దగ్గరి కెందు కొస్తాను?" అనేసరికి విసుగ్గా పుస్తకం పడేసి లేచింది.

"కాఫీపొడి ఎందుకే. . . ఎవరికన్నా జ్వరమేమిటి?"

"మరేనమ్మా. . . మా చంద్రికి నిన్నటినుండి ఒకటే జరం" అంటూ కాఫీపొడి తీసుకుని వెళ్ళిపోయింది రంగి.

రంగిని అలా పంపి, మళ్ళీ వచ్చి పుస్తకం చేతిలోకి తీసుకుంది గాని, ఎందుకనో చదవ బుద్ధి కాలేదు. పేజీలు తిరగేస్తుంటే రంగి రూపమే కనబడ సాగింది. ఎంత కాదనుకున్నా, రంగితో తనని పోల్చుకోకుండా ఉండలేకపోయింది.

* * *

ఎర్రరంచు చిలకాకు పచ్చ చీర, ముక్కుకి కమ్మలు, కొప్పులో ముద్దబంతి పూవుతో మొగ్గలా తయారయి వచ్చింది రంగి— "ఏదన్నా పనుంటే ఇప్పించం డమ్మగారూ!" అంటూ.

అప్పటికి వారం రోజుల క్రితం పనిమనిషి మానేయడంతో నానా హైరానా పడుతున్న లక్ష్మీదేవి వెంటనే పని ఇచ్చేసింది. అలా అడుగు పెట్టిం దా ఇంట్లో రంగి. ఆ సంవత్సరమే పెళ్ళయి వెళ్ళిపోయిన సుమిత్ర, పండక్కి రంగిని చూసి మెచ్చుకుంది. దొడ్డిగోడ అవతల గుడిసె వేసుకుని ఉంటున్న రంగి ఎప్పుడు పిలిస్తే అప్పుడు పలికేది. కొత్త కాపరం పెట్టుకున్న రంగిని ముచ్చటగా చూసేది లక్ష్మీదేవి.

సాయంత్రం మిల్లు వదిలేయడమే గుడిసె కొచ్చిన దగ్గరి నుండి చిలక లాగున్న రంగిని పట్టుకు వేళ్ళాడే వాడు రంగడు. ఇద్దరు ఒక్కసారి తినాలి. కుండలు కడుక్కునే వరకు ఈ కబురు, ఆ కబురు చెప్పుతూ కూర్చునేవాడు రంగడు.

"నాను కూకునే వరకూ ఆడు ముద్ద నోటి కెత్త దమ్మాయిగోరు. . . సేతిలో పైసా ఉంటే పాలు మిటాయో, పువ్వులో తెత్తేగాని. . . రాడు" అంటూ ముసిముసి నవ్వులతో చెప్పేది రంగి సుమిత్రతో.

"రంగీ! మీ రంగ డేమంటున్నాడే? పండక్కి కొత్త కోక కొంటాననలేదూ? అయితే, ఏ యే సినిమాలు చూశారు— ఏమిటీ?" దీర్ఘం తీస్తూ ఆటలు పట్టించేది సుమిత్ర.

"డబ్బులుంటే కొనేస్తా డమ్మాయి గోరూ! అందుకే నించుకుండిపోతన్నా

దనుకోండి. 'పర్లేదులే, మాకూ... అమ్మాయిగో రేదన్నా కోక ఇస్తాదు కట్టుకుంటాలే' అంటున్నాను."

"అబ్బో, పెద్ద ప్లానేవేశావే? అయితే, ఇంతకీ చీరివ్వాలంటావు?"

"అదేటమ్మా... బాబుగారు మీ కో రెండు కొత్త చీరలు కొన్నప్పుడు నా కో పాత చీర పడెయ్యడానికి!"

"పర్లే! ఇస్తాలే" ముసిముసిగా నవ్వుకుంటూ తన అదృష్టానికి పొంగిపోయింది సుమిత్ర.

* * *

"అమ్మగారూ! కుంత చింతకాయ పచ్చడెట్టుం డమ్మగారూ!"

"ఏమే? ఏమిటే విశేషం? ఆ.. తెలుస్తూనే ఉందిలే! పండంటి కొడుకుని కను!" అంటూ పచ్చడి చేతిలో పెట్టింది లక్ష్మీదేవి.

"అమ్మాయిగారికీ కబురు రాయండి."

"అలాగేలే! అన్నట్టు మీ మామ ఏమంటున్నాడే? నిన్ను నేలమీద నడవనిస్తున్నాడా?"

"పోండమ్మగారూ!" అంటూ వెళ్ళిపోయింది రంగి.

* * *

నెలలు నిండుతున్న రంగి పనికి వచ్చిపోతూనే ఉంది.

"పురిటికి వెళ్ళవేమిటే!"

"లేదమ్మగారూ! మా పిన్నమ్మ కూతురు చంద్రని సాయానికి తెచ్చుకుంటాను."

అలా అడుగు పెట్టింది చంద్రమ్మ ఆ ఇంట్లో. రంగికి మగపిల్లవాడు కలగడం, అది జబ్బుచేసి పోవడం జరగడంతో చంద్ర అక్కడే ఉండవలసి వచ్చింది. ఆ ఉండడం... ఉండడం... శాశ్వతంగా ఉండిపోయింది. రంగి తేరుకుని తిరిగి పనిలోకి రావడం ప్రారంభించింది.

* * *

"మీ చెల్లెలింకా వెళ్ళలేదేమిటే?" గిన్నెలు తోముతున్న రంగిని అడిగింది లక్ష్మీదేవి.

అలా అడగడంతోనే అంతవరకూ దానిలో రగులుకొంటున్న అగ్ని మంటలు లేసింది. ఘోరుమంటూ జరిగినదంతా చెప్పింది.

"నా కళ్ళముందే నమ్మగారూ... ఏది తెచ్చినా దాని చేతిలోనే ఇడతాడు. తెచ్చిన కూలి నగం దాని చేతిలో పోసేస్తాడు... దాని సినిమాలు... షికార్లు దానివి."

"పంపించేయలేకపోయావా?"

"ఎక్కడికి పంపనమ్మగారూ... మొగుణ్ణొదిలేసి ఒక్కర్తె ఏదో ఇంత మరగ బోసుకుంటుందని సాయానికి రమ్మంటే... ఇదీ అది చేసిన సాయం." కళ్ళు తుడుచుకుంటూ అంది.

* * *

"ఏమే, రంగీ, మీ చెల్లెలు ఇక్కడే ఉందట?" పువ్వులు మాల కడుతూ అడిగింది సుమిత్ర.

"అవునమ్మాయిగారూ... మరెక్కడి కెళ్తాది?" దాని ఏ పని చేసుకుంటూ చెప్పిన సమాధానం విని ఆశ్చర్యపోయింది.

"నువ్వెలా ఊరుకున్నావే? నీ కేమీ అనిపించడం లేదూ?" ఆశ్చర్యంగా అంది

"ఎందు కనిపించదండి... అయితే, మాత్రం ఏటిసేస్తా? కాకపోతే, తగువులు, అల్లర్లు, ఆడు తన్నడం, నా ఏడ్వడం, నలుగురు నవ్వడం... ఇదేకదా... నా నోర్మూసుకుంటే ఏ గొడవ లేదు... దానికి మిల్లిలో పని చూశాడు. ఏదో ముగ్గురం అయిన కాడి కింత కూలి సేసుకుని, బొట్టల్ని పెంచుకుంటున్నాం. దానికి ఆడంటే ముద్దే. అప్పుడప్పు డేదో తెచ్చినా ఏదో ఇలాగ సమిష్టిగా ఎళ్ళిపోతున్నాం. లేకపోతే నన్ను తన్ని తగిలేస్తే నాకు దిక్కేటమ్మాయిగారు!"

అది అన్ని విధాలా సరిపెట్టుకుని పరిస్థితులకి తల ఒగ్గి నెగ్గుకొస్తున్న దంటే సుమిత్రా కేం నచ్చలేదు.

'కట్టుకున్న భర్త కళ్ళెదుట మరొక ఆడదానితో కులుకుతుంటే ఏ ఆడది సహించగలదు? దీని మట్టుకిది కొడుకుని పెట్టుకుని బ్రతకలేదు కాబోలు. అయినా, వాళ్ళ కేమిటిలే— అన్ని ఆలోచనలు, ఊహలు ఉంటా యేమిటి? ఏదో పూట కింత తిండి ఉంటే చాలు. భర్త, సంసారం, అనుబంధం అని ఆలోచించుకునే సంస్కారం మెక్కడిది! దీన్ని పల్లెటూరి మొద్దుని చేసి ఆటలాడిస్తున్నాడు వాడు!' మాల కట్టడం అయిపోయినా, ఆలోచనల్లో నుండి తేరుకోలేదు తల్లి పిలిచేవరకూ.

* * *

"అమ్మగారూ! మీ కేం పనిలేకపోతే మా అమ్మగారు రమ్మంటున్నారండి!" అంటూ వచ్చింది నీలవేణి పనిపిల్ల.

"పనేం లేదు! వస్తానని చెప్పు!"

"మాట మాటకి అక్కడి కెందుకే!" చెప్పు లేసుకుని బయలు దేరుతున్న సుమిత్రని చూసి విసుక్కుంది లక్ష్మీదేవి.



వీరభద్రమూర్తి (దారాసురం)
ఫొటో— ఎమ్. ఎస్. ఆర్. కె. ప్రసాద్ (మద్రాసు)

"మాట మాటకి ఎక్కడ కెళ్ళాను? ఇరుగు పొరుగిళ్ళ వాళ్ళయితే మాటలు, వెటకారాలు పడనమ్మ. ఆవిడయితే ఆవేం ఉండవు కదూ, అందుకే వెళ్తానంటావు! అలాగ ఇంట్లోనే చావాలి! ఆవిడ వెళ్ళనే వేం చెడిపోనులే! ఎవరి సుఖం వాళ్ళు చూసుకుంటే చూసి ఓర్వలేరు. నా లాగ పడి ఉంటే సంతోషిస్తారు."

"అవును, నే నేమన్నాను? ఎందు కలా రెచ్చిపోతావు? నోరెత్తి ఒక్క మాట అనకూడదు! వెళ్ళు... నీ కేం హద్దూ, పద్దూ!"

"అవును, అన్నిటికి బరి తెగించేసి ఉన్నాను కదూ నా కేం హద్దు, పద్దు? తల్లే ఇలాంటి మాటలంటే ఊరందరూ అనరూ మరి!"

"తల్లీ! వెళతావు గాబోలు వెళ్ళు!" మరి మాట్లాడకుండా తన పని చూసుకోవడంలో మునిగి పోయింది లక్ష్మీదేవి.

విసురుగా చెప్పులు టకటక లాడించుకుంటూ ఎదురుగా రెండిళ్ళవతల ఉన్న మేడింటికి బయలు దేరింది సుమిత్ర.

* * *

"హల్లో, సుమిత్రా! ఏమిటి, ఎక్కడా దర్శనం లేదు. కబురు పెడితేగాని రాకూడదనుకున్నావా?"

"అబ్బె! అదేం లేదు, నీలా! ఏదో నావెల్ దొరికితే అలా చదువుకుని ఉండిపోయాను. నాన్నగారొకటే— ఊళ్ళో లేరు!"

"ఎక్కడికి వెళ్ళారు? అది సరేగాని, సాయంత్రం పిక్చర్‌కి పోదాం, వస్తావా?" మొదటి ప్రశ్నకు జవాబు ఆశించకుండా అడిగింది నీలవేణి, ఉరఫ్ 'నీలూ'—

"పిక్చర్‌కా? ఏం, ఇంకే మీ ప్రోగ్రామ్స్ లేవేమిటి?"

"ఆయన కేదో పార్టీ ఉందట, మరి నా కింకేం ప్రోగ్రామ్ లేదు ఈ వేళ. అందుకని... అయినా, మీ అమ్మగా రేమంటారో?"

"ఆ! అమ్మేమంటుంది...వస్తాను!" తల్లేమంటుందోనని మనసులో బిఱుకు బిఱుకుమన్నా నీల ముందు అలా అనడం ఇష్టంలేక ధైర్యంగా వస్తాననేసింది. అలా మాట్లాడుకున్నంతలో ఫోన్ మ్రోగింది.

"హల్లో! నేను నీలూ మాట్లాడుతున్నాను. ఎవరూ? రాజా! ఏమిటి, ఎక్కడా కనబడ్డం లేదు...నేను కనబడ్డం లేదా... హా... హహా... భలే విట్స్ వేస్తున్నావు. ఓరా? లాట్ పార్టీ ఇస్తున్నాడట. చెప్పాడు. నా కేం తోచడం లేదు. ఇప్పుడే పిక్చర్ ప్రోగ్రామ్ వేస్తున్నాను. ఏమిటి... పిక్చరా? అంత ఇంపార్టెంట్

కాదులే. అయితే, సిక్స్ ఓ క్లాక్‌కి వస్తావా? ఓ—కే." ఫోనులో సంభాషణ అయిపోయింది.

అంతవరకు శ్రద్ధగా ఆ సంభాషణ ఆలకిస్తున్న సుమిత్ర సినిమా ప్రోగ్రామ్ తప్పిపోయినందుకు సంతోషించినా, అత నెవరో ఫోన్ చేసినందుకు కాన్సిల్ చేసిందని చిన్నబుచ్చుకుంది.

"సారీ, సుమిత్రా, మనం రేపు వెళదాం. రాజా వస్తానని ఫోన్ చేశాడు." నవ్వుతూ తేలిగ్గా అవేసింది.

"సరే, అలాగే! నువ్వన్నావని..." అవేసింది సుమిత్ర.

డ్రింక్స్ కలపడానికి లేచింది నీల. షిఫాన్ నైలెక్స్ చీరలో మలచిన శిల్పంలా ఉన్న నీల అందానికి తగినట్లు అభినయం కూడా అలాగే ఉంటుంది. ఆ లేవడం లోని సున్నితత్వం, ఒయ్యారం చూసి సామాన్యంగా ఉన్న తనను పోల్చుకుంది.

ఆరెంజ్ స్క్వాష్ కలిపి తెచ్చింది నీల. ప్రతి క్షణం తన ఉనికిని జ్ఞాపకం చేస్తున్నట్లు ప్రవర్తిస్తుంది.

పది మందిలో ఉన్నా తన ప్రత్యేకత నిలబెట్టుకొంటుంది నీల. డ్రింక్ తీసుకుని, "వస్తా, నీలా!" అంటూ లేచింది.

"రేపు కబురు పెడతాను—వెళదాం!" అంది తనూ లేస్తూ నీల.

"సరిలే! నీ కింకేం ఎంగేజ్‌మెంట్ లేకపోతే కదా!" పేలవంగా నవ్వేసి బయలుదేరింది.

* * *

"అమ్మాయ్! ఆ పప్పు కాస్త రుబ్బి పెట్టు. ఉదయం టిఫిన్‌కి!" ఆలోచిస్తూ కాళ్ళు కడుగుతున్న సుమిత్ర నంది లక్ష్మీదేవి.

పప్పు రుబ్బుతున్నదన్న మాటేగాని, నీలవేణి గురించి ఆలోచించకుండా ఉండలేకపోయింది. పుస్తకాలే తనకి నీలని పరిచయం చేశాయి. చదవకపోయినా, అన్ని పుస్తకాలు కొనే అలవాటుంది నీలకి. ఏ పుస్తకం కొనకుండానే, అన్ని పుస్తకాలు చదివే అలవాటుంది సుమిత్రకి. పరిచయా లయిన తరవాత ఒకరి గురించి ఒకరు తెలుసుకోవడం ఎంత సేపు? ఆ తెలిసిన దాని గురించే ఆలోచించకుండా ఉండలేక పోయింది సుమిత్ర.

* * *

'రాధిక టెక్స్‌టైల్స్' ప్రొప్రయిటరు ఏకైక కుమార్తె నీలవేణి. చిన్నప్పటి నుండి మొండితనం, ఖాతరులేనితనం, చిలిపితనం ఉగ్గుపాలతో అరిగించుకొన్నా, నీలవేణి అందానికి అవి అలంకారాలు గానే అమిరాయి. వయసు, అందంతో బాటు అవీ పెరిగాయి. కాలేజీ రోజుల్లో తనని పట్టుకుని వేళ్ళాడే అమ్మాయిలనీ, అబ్బాయిలనీ ఏ నాడూ కాదనలేదు నీల. నిత్య నూతనంగా నవ్య వసంతంలా బి. ఎ. పూర్తి చేశాక అంతస్తుకి తగిన సంబంధం అంటే ఎదురు చెప్పకుండా చేసుకుంది శేఖర్‌ని. అంతస్తులకి తగినట్లు అభిరుచులు ఒక్కటే. చిన్నప్పటి నుండి ఒక లాంటి వాతావరణంలోనే పెరిగిన శేఖర్, నీలవేణి ఇద్దరూ ఒకలాగే జీవితం అనుభవించడం అలవాటు చేసుకున్నారు.

శేఖర్ వాళ్ళ కంపెనీ పనులు చూసుకుంటూ ఆ సర్కిల్‌లో అవసరమైనంత అభివృద్ధి సాధించడానికి ఏ పనైనా చేస్తాడు. తన పార్టీలు, తన గొడవలు తనవి. అవసరమైనంత మేరకు నీలను పరిచయం చేస్తాడు. ఇంక మిగిలిన టైమంతా నీల ఇష్టమే. కాలేజీ రోజుల్నించి అంటిపెట్టుకున్న ఫ్రెండ్స్ వస్తారు. . . పోతారు — వాళ్ళిష్టం. తనకేం తోచకపోతే వాళ్ళతో సినిమాలకి, షికార్లకి వెళుతుంది.

శేఖర్ లేనప్పుడు లతని ఫ్రెండ్స్ ఇష్టమైతే వస్తారు. నీలను పార్టీలకి తీసుకువెళతారు. బార్‌కి వెళుతుంది. కంపెనీలో పనిచేసే అమ్మాయిలకు చాలా హెల్ప్ చేస్తాడు. వాళ్ళతో తిరుగుతాడు. అదేం పట్టించుకోదు నీల. ఇద్దరికీ బుద్ధి పుడితే, కలిసి వెళ్ళాలను కుంటే ఎక్కడికన్నా వెళతారు. లేకుంటే నీల పుట్టకి నీల తన ఫ్రెండ్స్‌తో తిరుగుతుంది. విశాలమైన బంగళాలో వాళ్ళిద్దరు ఎప్పుడు ఎవ రుంటారో వాళ్ళ పనివాళ్ళకే తెలుస్తుంది. అలాంటి నీలవేణికి అహంకారం లేదు కనకనే సామాన్యమైన సుమిత్రతో స్నేహం చేసింది. సుమిత్ర దృష్టిలో ఆ బంగళా ఒక స్వర్గం; వాళ్ళిద్దరూ అమరులు.

'భర్త అలా ఇష్టం వచ్చినట్లు తిరుగుతుంటే ఎలా మనసొప్పుతుందో? ఎందు కొప్పదూ. . . తన మటుకి తను తన సరదాలు తీర్చుకుంటుంది కదా! అదృష్టవంతురాలు! ఏ చదువూ సంధ్యా లేని పల్లెటూరి మొద్దు రంగి చేత కానితనంతో సర్దుకుపోతూ, ఉన్నదానిలోనే తృప్తిని వెదుక్కుంది. డబ్బు, చదువు, అందం అన్నీ ఉండి ధైర్యంగా తన సుఖం తను చూసుకుని ఏ గొడవలు లేకుండా చిన్నపిల్లలా చలాకీగా తిరుగుతూ, నలుగురిని నవ్విస్తూ సుఖపడుతూంది నీలవేణి. కాని, తనో . . . అటుకి. . . ఇటుకి మధ్య త్రిశంకుస్వర్గంలో వేళ్ళాడుతూంది. ఆయన చేసే పనులకి . . . రంగిలా సర్దుకు పోవడానికి అభిమానం, మిడి మిడి అహంకారం అడ్డొస్తున్నాయి. నీలవేణిలా తెగించి తన సుఖం తను చూసుకోవడానికి తనకి ధైర్యం చాలదు. మధ్యతరగతి కుటుంబపు మర్యాద అడ్డొస్తుంది. అడకత్తెర లాంటి సంఘం ఏమాత్రం మధ్యతరగతి మనుష్య లని ఆమోదిస్తుందా? అంత డబ్బుండబట్టే నీలవేణి నీడ చూడడానికి భయపడతారు మధ్యతరగతి మనుష్యులు. ఆ భయమే అసూయతో చాటుగా తిట్టుకునేటట్లు, తమ చేతకానితనం మీద కసితో అనవసరంగా ఆడిపోసుకునేటట్లు చేస్తుంది. తనో. . . తనేం చెయ్య గలిగింది? ఎన్నో ఆశలతో, పాటి కోర్కెలతో కొత్త కాపరానికి వెళ్ళింది. రెండు మూడు సంవత్సరాలు బాగానే గడిచాయి. కొత్త ఎరువులోని మత్తు దిగేసరికి, తనని కాదు ఎంతమందినైనా మత్తెక్కించగల నేర్పుంది ఆయనకని తెలుసుకుంది— దానితో మొదలయ్యాయి.

"నీ కేం అన్యాయం చెయ్యడం లేదుగా? నీసరదాలు నీకు తీరుస్తున్నప్పుడు నీ కేం? నా కింకేం సరదా ఉండకూడ దనుకుంటున్నావా? ఇంకా నయమే సంతోషించు—నేను కనక నిన్ను ఈమాత్రం చూస్తున్నాను. అదే చెయ్యకపోతే ఏం చేసేదానివి?" అంటూ ఎదురుప్రశ్నలు వేస్తున్న ఆనంద్‌ని చూసి ఉక్రోషంతో ఉడికిపోయింది.

"ఛీ! మీ లాంటి నీతి లేని మనిషితో జీవించడంకన్నా చావడం నయం. అంతేనా . . మీ సరదాలు మీరు తీర్చుకోవడం తప్ప. . . మన మధ్య అనుబంధాలు, అభిమానాలు లేవే లేవా? ఒకరి కోసం ఒకరు బ్రతకని ఈ బ్రతుకులో అర్థం లేదు. ఈ పెళ్ళికి అంతకన్నా అర్థం లేదు" అంటూ తెగతెంపులు చేసుకుని వచ్చేసింది తను అమ్మగారింటికి. ఒక్కర్తే కూతురు కనక అమ్మ, నాన్న కుమిలిపోవడం తప్ప ఇంకేమీ చెయ్యలేకపోయారు. తనకి చెప్పిన సమాధానమే నాన్నకి చెప్పారు. తన పట్టుదల అమ్మ సడలించలేకపోయింది. అందుకే ఎవరికీ అందకుండా, పొందకుండా ఏ సుఖం . . సంతోషం లేకుండా మోడులా మిగిలింది. ఇందులో ఎవరిది తప్పు? తనదే తప్పు. మధ్యతరగతి మనస్తత్వంతో ఎటూ సరిపెట్టుకోలేక, ఏమీ చెయ్యలేని తనదే తప్పు. . .

"అమ్మాయ్. . . ఏమిటే ఇంకా అలా రుబ్బుకుని ఉండిపోయావు? బాగుందిలే. . .లే" అంటూ తల్లి కేకలు వేయడంతో ఈ లోకంలో కొచ్చింది మధ్యతరగతి మనిషి సుమిత్ర. ★

